క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి



రోడ్డు పరిస్థితిని కలెక్టర్‌కు వివరిస్తున్న కాసుల శ్రీనివాస్‌

జనగామ: జిల్లా కేంద్రంలోని నర్మెట ప్రధాన రహదారి హెడ్‌పోస్టాఫీస్‌ ఏరియాలో గుంతలమయంగా మారిన రోడ్డును బాగు చేయించాలని ఆ ప్రాంతానికి చెందిన వ్యాపారులు కాసుల శ్రీనివాస్‌, వంశీకృష్ణ, తిరుమల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాజేష్‌, రాజురెడ్డి కోరారు. ఈ మేరకు వారు మంగళవారం కలెక్టర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై ప్రమాదకర గుంతలు ఏర్పడడమే కాకుండా దుమ్ము, దూళితో వ్యాపారం చేసుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో తహసీల్దార్‌, గ్రేయిన్‌ మార్కెట్‌, మున్సిపల్‌, రైల్వేస్టేషన్‌ ఉండడంతో నిత్యం అనేక గ్రామాల నుంచి వందలాది మంది ప్రజలు వస్తుంటారు కావున వారి సౌకర్యార్థం సులభ్‌ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించారు. కలెక్టర్‌ వెంటనే స్పందించి ఇందుకు సంబంధించిన ఎస్టిమేషన్‌ తయారు చేసి తనకు అందించాలని కమిషనర్‌ను ఆదేశించినట్లు శ్రీనివాస్‌ తెలిపారు.

చర్య తీసుకోవాలి

జనగామ రూరల్‌: ఎంసీహెచ్‌ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్‌ అమృత్‌పై దాడి చేసి గాయపరిచిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మంగళవారం మెడికల్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ గోపాల్‌రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్‌ కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌ ఆస్పత్రిలో కార్మికులకు భద్రత కల్పించాలని, సిబ్బందిపై జరుగుతున్న దాడులు అరికట్టేందుకు ఔట్‌ పోస్ట్‌ ఏర్పాటు చేయాలని కోరారు. యూనియన్‌ అధ్యక్షుడు ఎం.రామ్‌ దయాకర్‌, రఘు, అజయ్‌, బాలరాజు యాదగిరి, కర్ణాకర్‌, కుమార్‌, రేణుక, స్వామి, సౌజన్య, అఖిల, అనిత, రజిత తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌ స్కూల్‌కు రండి..



విద్యార్థులతో మాట్లాడుతున్న గణేశ్‌

రఘునాథపల్లి: మెరుగైన విద్యాబోధన, అంకితభావంతో పని చేసే ఉపాధ్యాయులు ఉన్న మోడల్‌ స్కూల్‌కు రండని మండలంలోని వెల్ది ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. మంగళవారం మోడల్‌ స్కూల్‌ ఆంగ్ల ఉపాధ్యాయుడు గణేశ్‌ కందగట్ల ఆధ్వర్యంలో మండలంలోని రామరాయనిబంగ్లా ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఐదో తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. మోడల్‌ స్కూల్‌లో ఉన్న వసతులు, సౌకర్యాలు, ప్రత్యేకతలు గతంలో సాధించిన ఫలితాలను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించి 6వ తరగతిలో చేరేందుకు తమ పాఠశాలలో చేరాలని సూచించారు. మోడల్‌ స్కూల్‌ ప్రవేశ పరీక్షలకు మార్చి 10 వరకు గడువుందని, వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశాల వివరాల కోసం 8555825955 నెంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పరిపూర్ణాచారి, మోడల్‌ స్కూల్‌ పీఈటీ మారపల్లి రాజయ్య ఉన్నారు.

పండ్లకు భలే గిరాకీ



జనగామ: బుధవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని, పండ్ల వ్యాపారం జోరుగా సాగుతుంది. పరమశివుడి సేవలో వేలాది మంది శివ భక్తులు ఉపవాస దీక్షలతో జాగారం చేస్తారు. స్వామి దైవ చింతనలో కేవలం పండ్లను మాత్రమే స్వీకరిస్తారు. దీంతో పండ్ల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, నెహ్రూపార్కు, వరంగల్‌-హైదరాబాద్‌ జాతీయ రహదారిపై పండ్ల అమ్మకాలు జరుగుతున్నాయి.

గుంతలమయంగా బీటీ రోడ్లు

- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

స్టేషన్‌ఘన్‌పూర్‌: డివిజన్‌కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో ప్రధాన బీటీ రోడ్లు గుంతలమయంగా మారినా పాలకులు, అధికారులకు పట్టడం లేదు. ఘన్‌పూర్‌ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రోడ్లపై స్టేషన్‌ఘన్‌పూర్‌, శివునిపల్లి జంట పట్టణాల్లో పలుచోట్ల పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. గతంలో పలు రోడ్డు ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌ నుంచి జఫర్‌గఢ్‌, పాలకుర్తి, ఐనవోలు, తాటికొండ తదితర ప్రాంతాలకు వెళ్లే రోడ్లపై పలు చోట్ల పెద్ద సైజులో గుంతలు ఏర్పడ్డాయి. గతంలో స్టేషన్‌ఘన్‌పూర్‌ గాంధీ చౌరస్తా నుంచి రైల్వేగేటు వరకు, శివునిపల్లి వివేకానంద చౌరస్తా నుంచి రైల్వేస్టేషన్‌, శివునిపల్లి నుంచి నమిలిగొండ, పాంనూర్‌ వైపు వెళ్లే రోడ్ల విస్తరణ పనులు చేపట్టారు. అయితే పనులు తూతూమంత్రంగా చేయగా మూన్నాళ్ల ముచ్చటగా మారింది. రోడ్లపై ఉన్న గుంతలపై తూతూమంత్రంగా ప్యాచ్‌ వర్క్‌లు చేసి వదిలేయడంతో వర్షాకాలంలో నీరు నిలిచి తిరిగి పెద్ద సైజులో గుంతలు ఏర్పడ్డాయి. దానికి తోడు మొరంమట్టి, గ్రానైట్‌, పెద్ద బండరాళ్లు తదితర లోడ్‌లతో భారీ వాహనాలు ఆయా రోడ్లపై వెళ్తుండగా రహదారులు పూర్తిగా ధ్వంసమై గుంతలతో ప్రమాదకరంగా మారాయి. రోడ్డుపై గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం ప్రజల పాలిట శాపంగా పరిణమిస్తుంది.



శివునిపల్లి అంబేడ్కర్‌ సెంటర్‌ వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతలు



ఘన్‌పూర్‌ శివాజీ సెంటర్‌ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ప్రమాదకర ప్రదేశాలు

ప్రధానంగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో శివాజీ చౌక్‌ వద్ద వాహనాలు రైల్వే ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి ఎక్కే ప్రదేశంలో రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు ఉన్నాయి. శివునిపల్లిలో అంబేడ్కర్‌ సెంటర్‌ వద్ద నమిలిగొండ, పాంనూర్‌, జఫర్‌గఢ్‌ ప్రాంతాలకు వెళ్లే రోడ్డుపై పెద్ద సైజులో గుంతలు ఏర్పడ్డాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌ నుంచి పాలకుర్తికి వెళ్లే రోడ్డుపై స్థానిక రైల్వేస్టేషన్‌ సమీపాన మూలమలుపు వద్ద ప్రమాదకరంగా గుంతలు ఉన్నాయి. అదేవిధంగా స్థానిక బస్టాండ్‌ వద్ద, గాంధీ చౌరస్తా వద్ద, ఘన్‌పూర్‌ నుంచి తాటికొండ రోడ్డుపై పలుచోట్ల ప్రమాదకరంగా గుంతలు ఉన్నాయి. ఆయా ప్రదేశాల్లో రోడ్డుపై గుంతలు ప్రమాదకరంగా ఉండగా వాహనదారులకు సర్కస్‌ ఫీట్లు తప్పడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి వెంటనే రోడ్ల మరమ్మతు పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పెరగనున్న వాహనాల రద్దీ

నేడు (బుధవారం) శివరాత్రి పర్వదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌ మీదుగా పాలకుర్తి, ఐనవోలు, తాటికొండ తదితర ప్రాంతాలకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాల్లో వెళ్లనున్నారు. శివరాత్రికి వెళ్లే భక్తుల వాహనాలతో ఆయా రోడ్లపై వాహనాల రద్దీ పెరగనుంది. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న గుంతలతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత చింతించేకన్నా అధికారులు, పాలకులు స్పందించి వెంటనే రోడ్ల మరమ్మతు పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతలతో ఇబ్బందిగా ఉంది



స్టేషన్‌ఘన్‌పూర్‌, శివునిపల్లి జంటపట్టణాలలో బీటీ రోడ్డుపై గుంతలతో తీవ్ర ఇబ్బందిగా ఉంది. అనునిత్యం వాహనదారులు అవస్థల పాలవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలి.

– కె.శరత్‌కుమార్‌, శివునిపల్లి

సమస్య పరిష్కరించాలి



ఘన్‌పూర్‌లో బీటీ రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ద్విచక్రవాహనాలు, ఆటోలను నడిపేవారికి తీవ్ర సమస్యగా ఉంది. అధికారులు, పాలకులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– కుంభం కుమార్‌, స్టేషన్‌ఘన్‌పూర్‌

గుంతలను మట్టితో పూడుస్తాం

ఘన్‌పూర్‌ డివిజన్‌ కేంద్రంలో బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడిన సమస్య మా దృష్టిలో ఉంది. ప్రస్తుతానికి మట్టితో గుంతలను పూడుస్తాం. త్వరలోనే పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– భాస్కర్‌, ఏఈ, ఆర్‌అండ్‌బీ

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



కొడకండ్ల: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వందేమాతరం ఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు రవీందర్‌ అన్నారు. మండలకేంద్రంలోని టీజీఆర్‌ఎస్‌ జేసీలో మంగళవారం ప్రిన్సిపాల్‌ తమ్మి దిలీప్‌కుమార్‌ అధ్యక్షతన నిర్వహించిన పదో తరగతి, ఇంటర్‌ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీడీఓ మల్లికార్జున్‌ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి నేపథ్యంలో జీపీ మోటర్లు రిపేరు లేకుండా చూడాలన్నారు. పలు వీధుల్లో తాగునీరు వృథా పోకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్‌ అసిస్టెంట్‌ నర్మద, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలని నిరసన



పంప్‌హౌస్‌ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్‌: స్టేషన్‌ఘన్‌పూర్‌ రిజర్వాయర్‌ నుంచి నవాబుపేట మెయిన్‌ కెనాల్‌కు సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ మండలంలోని చంద్రు తండా, మాన్‌సింగ్‌తండా, విశ్వనాథపురం గ్రామాలకు చెందిన రైతులు స్థానిక దేవాదుల పంప్‌హౌస్‌ వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తలాపున గోదావరి ఉన్నా తమ పంటపొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి తక్షణమే స్పందించి సాగునీరు సరఫరా అయ్యేలా ఘన్‌పూర్‌ రిజర్వాయర్‌ నుంచి నీటిని అందించాలని వారు కోరారు. రైతులు భూక్య ఆము, విజయ్‌, రామ్‌సింగ్‌, యాకమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు రైతుల విజ్ఞప్తి

రఘునాథపల్లి: పొలాలు ఎండుతున్నాయి.. బొమ్మకూర్‌ రిజర్వాయర్‌ ద్వారా చెరువులు నింపాలని పలు గ్రామాల ప్రజలు కోరారు. నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మేకలగట్టు మాజీ ఎంపీటీసీ బానోత్‌ భిక్షపతినాయక్‌, పలువురు రైతులు హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి విజ్ఞప్తి చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటి నీళ్లు లేక వరి పొలాలు ఎండుతున్నాయని, బొమ్మకూర్‌ రిజర్వాయర్‌ గుండా మత్రిగుంట చెరువు, మేకలమ్మ చెరువు, ఖిలాషాపూర్‌ పటేల్‌ చెరువులను నింపితే ఆయా గ్రామాల్లోని 90 శాతం రైతులకు మేలు జరుగుతుందన్నారు. తమ వినతికి ఎమ్మెల్యే కడియం సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. అలాగే ఇరిగేషన్‌ ఎస్‌ఈ సుధీర్‌ను కూడా కలిసి వినతి పత్రం అందజేసినట్లు భిక్షపతినాయక్‌ తెలిపారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

స్టేషన్‌ఘన్‌పూర్‌: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు గ్రామాల మధ్య స్నేహభావం పెంపొందుతుందని కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, పార్టీ జిల్లా నాయకులు తోట వెంకన్న, నెలమంచ అజయ్‌రెడ్డి అన్నారు. ఇప్పగూడెం గ్రామంలో గ్రామ యూత్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి వరంగల్‌ జిల్లాస్థాయి క్రికెట్‌ టోర్నమెంట్‌ను వారు ముఖ్యఅతిథులుగా హాజరై మంగళవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పగూడెం గ్రామంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లాస్థాయి క్రికెట్‌ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దైద ఎలిషన్‌, కొండెం రాజిరెడ్డి, వారాల రాజు, ఆర్గనైజర్స్‌ బొంకూరి మహేష్‌, మంద మహేందర్‌, బొంకూరి దయాకర్‌ మంద రాకేష్‌, ఐత అజయ్‌, జీడి మోష తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్‌ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

ఘనంగా శివపార్వతుల కల్యాణం



స్టేషన్‌ఘన్‌పూర్‌: కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు



జనగామ రూరల్‌: పంచకోసు ఆలయంలో..



బచ్చన్నపేట: సీతారామాంజనేయస్వామి ఆలయంలో చండీహవనంలో పాల్గొన్న భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్‌: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా డివిజన్‌ కేంద్రంలోని పార్వతీ సమేత శ్రీస్వయంభూ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పురోహితులు జోస్యం నాగరాజు శర్మ, ఆలయ పూజారులు రామలింగయ్యశర్మ, ప్రవీణ్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య శివపార్వతుల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

సిద్ధేశ్వరాలయంలో పూజలు

బచ్చన్నపేట: కొడవటూరులోని సిద్ధేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, మంగళహారతి, మంత్ర పుష్పం, రుద్ర హోమం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఓం నమఃశివాయ తెలిపారు. హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్‌ ఆముదాల మల్లారెడ్డి, ఈఓ చిందం వంశీలు అన్ని వసతులను కల్పించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

సిద్ధేశ్వరాయలంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించనున్న శివపార్వతుల కల్యాణానికి హాజరవ్వాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పలువురు అధికారులకు ఆహ్వాన పత్రికలను అందజేసినట్లు సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచ్‌ సతీష్‌రెడ్డి తెలిపారు.



జఫర్‌గఢ్‌ కూనూర్‌ ఆలయంలోని లింగం

చిన్నరామన్‌చర్లలో ..

చిన్నరామన్‌చర్లలో నేటి (బుధవారం) నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించనున్న బొడ్డి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ, దుర్గామాత పండుగకు హాజరుకావాలని గ్రామ బీఆర్‌ఎస్‌ నాయకులు.. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఎద్దుగూడెంలో చండీ హవనం

ఎద్దుగూడెం గ్రామంలోని రామలింగేశ్వర సహిత సీతారామాంజనేయ స్వామి ఆలయంలో చండీ హవనం ఘనంగా నిర్వహించినట్లు ఎద్దు ప్రభాకర్‌ తెలిపారు. ఆలయ సప్తమ వార్షికోత్సవం సందర్భంగా కొడకండ్ల రాధాకృష్ణ శర్మ, పురోహితుడు అర్వపల్లి కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించినట్లు చెప్పారు. అర్చకులు చెక్క సతీష్‌కుమార్‌, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన..

పాలకుర్తి: మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కొనసాగుతున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం భక్తుల కోసం నిర్వహించనున్న మహా అన్నదాన కార్యక్రమ ఏర్పాట్లను కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ ఝాన్సీ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా అన్నదానం చేసే అవకాశం దక్కిందని అన్నారు.

ముస్తాబైన శివాలయాలు

జఫర్‌గఢ్‌: మహా శివరాత్రి పండుగ సందర్భంగా గ్రామాల్లోని శివాలయాలు ముస్తాబైనాయి. కూనూర్‌లో ఉమామహేశ్వర భక్తాంజనేయ స్వామి దేవాలయాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. తెలంగాణలో అతి పెద్ద స్పటిక లింగమైన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు స్వామి వారి లింగాన్ని పూలతో అలంకరించారు. కాగా, జఫర్‌గఢ్‌, తిమ్మంపేట, తమ్మడపల్లి (ఐ) తదితర గ్రామాల్లో కూడా ఆలయాలు ముస్తాబైనాయి.

పంచకోసు రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జనగామ రూరల్‌: చీటకోడూర్‌లోని పంచకోసు రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ఘనంగా ప్రత్యేక పూజలు చేశారు.

సంక్షిప్త సమాచారం

'సరోత్తం రెడ్డిని గెలిపించాలి'

దేవరుప్పుల/కొడకండ్ల: ఉపాధ్యాయ శాసనమండలి బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ నాయకులు దేవరుప్పుల, కొడకండ్ల మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను అభ్యర్థించారు. దుబ్బ రాజశేఖర్‌ గౌడ్‌, పెద్దగొని రాజు, సత్తయ్య, తిరుపతి నాయక్‌, గణేష్‌ కోటేశ్వర్‌, మోడపల్లి సోమన్న, శ్రీనునాయక్‌, మహేష్‌ ఉన్నారు.

విద్యారంగానికి 15 శాతం బడ్జెట్‌ కేటాయించాలి

లింగాలఘణపురం: విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని సాదిక్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ హైకోర్టు అడ్వకేట్‌ సాదిక్‌ అలీ డిమాండ్‌ చేశారు. మంగళవారం నెల్లుట్ల శ్రీనివాసనగర్‌ కాలనీలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో సాదిక్‌ అలీ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో విద్యామహోద్యమ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యామహోద్యమంలో భాగంగా విద్యార్థులు సీఎంకు పోస్టుకార్డులు రాసి ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.

స్వయంపాలన దినోత్సవం



లింగాలఘణపురం: కుందారం హైస్కూల్‌లో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం రవిశంకర్‌ మాట్లాడుతూ పాఠశాలల్లో స్వయంపాలన దినోత్సవాలతో విద్యార్థుల్లో స్వీయ నాయకత్వ లక్షణాలు అలవడుతాయని అన్నారు.

ఫర్టిలైజర్‌ షాపుల్లో తనిఖీ



పాలకుర్తి టౌన్‌: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్‌ షాపుల్లో తహసీల్దార్‌ శ్రీనివాస్‌, మండల వ్యవసాయ అధికారి శరత్‌ చంద్ర మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్‌ షాపులతోపాటు రైతు సహకార సంఘం గోదాంను పరిశీలించారు. పెస్టిసైడ్‌, యూరియా రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆర్‌ఐ రాకేష్‌ ఉన్నారు.

నివాళి

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన కాంగ్రెస్‌ నాయకుడు, గ్రామ మాజీ సర్పంచ్‌ కావటి మల్లయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. కాగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మల్లయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకన్న, రాందాసు, రమేశ్‌, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

నియామకం

స్టేషన్‌ఘన్‌పూర్‌: భూమాత రైతు సంక్షేమ సంఘం ఘన్‌పూర్‌ మండల అధ్యక్షుడిగా తాటికొండ గ్రామానికి చెందిన వక్కల రాజును నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవి తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాజు మంగళవారం ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ సంఘం మండల అధ్యక్షుడిగా నియమించిన జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సన్మానం

జనగామ రూరల్‌: హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మహిళా కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిరను జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబ సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు ఇందిర మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక సభ్యత్వాలు చేసేందుకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

సౌండ్‌సిస్టమ్‌ అందజేత



జఫర్‌గఢ్‌: మండలంలోని తమ్మడపల్లి (జి)గ్రామంలోని దూడల మల్లన్న గుడికి మాజీ సర్పంచ్‌ అన్నెపు పద్మ అశోక్‌ దంపతులు రూ.16,900 విలువ చేసే డీజే సౌండ్‌ సిస్టంను మంగళవారం అందజేశారు. గద్ద కొమురయ్య, కూరపాటి రాజేందర్‌, సారయ్య, వంశీ పాల్గొన్నారు.

తెల్లవారక ముందే మద్యం అమ్మకాలు

- మహిళలు, విద్యార్థినుల ఇబ్బందులు

జనగామ: జిల్లా కేంద్రం సిద్దిపేట రోడ్డులోని ఓ బార్‌లో తెల్లవారు జాము 6 గంటలకే మద్యం అమ్మకాలు చేస్తున్నారు. నిబంధనలను అతిక్రమించి మద్యం అమ్మకాలు జరుగుతున్నా ఎక్సైజ్‌ శాఖ కూర్చున్నచోట నుంచి కుర్చీ కదల్చడం లేదు. పొద్దుపొద్దునే మద్యం అమ్మకాలు మొదలు పెట్టడంతో.. కూరగాయలు, మార్కెట్‌, కిరాణా సరుకుల కోసం బయటకు వచ్చే మహిళలు ఈ బార్‌ దాటి వెళ్లి పోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థినులు భయం భయంగా పోవాల్సి వస్తుంది. బార్‌ గల్లీలో రెండు వైపులా బైక్‌లను పార్కింగ్‌ చేయడంతో పాటు మద్యం ప్రియులు అటువైపు రావడంతో ఆ ప్రాంతంలో పనుల కోసం వచ్చే వారికి దినదినగండం తప్పడం లేదు. ఉదయం 10 గంటలకు తెరుచుకోవాల్సిన బార్‌లో 6 గంటలకే అమ్మకాలు ఏంటని ప్రజలు ఎక్సైజ్‌ శాఖను ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు బెల్ట్‌ దుకాణాలు జత కావడంతో పట్టణంలోని అనేక ప్రాంతాలు మద్యం అమ్మకాలకు కేరాఫ్‌ అడ్రస్‌గా మారిపోతున్నాయనే విమర్శలు ఉన్నాయి.



ఓ బార్‌లో ఉదయం 6 గంటలకే మందు తాగుతున్న మద్యం ప్రియులు

ధన రాజకీయాలు, నిబద్ధతకు మధ్య జరుగుతున్న ఎన్నికలు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

జనగామ రూరల్‌: ధన రాజకీయాలకు, నిబద్ధతకు మధ్య ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో టీపీటీఎఫ్‌ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయులను కులం, మతం పేరుతో విభజించాలని చూస్తున్నారని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసిన 6 సంవత్సరాలు నిజాయితీగా నిబద్ధతతో ఉపాధ్యాయ, విద్యా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌ కుమార్‌, టీపీటీఎఫ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, వివిధ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌ రావు, వెంకటేష్‌, ఎస్‌ఎస్‌ రాజు, అంకూషావలి, చిక్కుడు శ్రీనివాస్‌, లక్ష్మయ్య, శ్రీరాములు, వసంత్‌ నాయక్‌, రాజిరెడ్డి, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి